క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గురజాల: మండలంలోని మూడు గ్రామాలకు ఆదివారం నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గురజాల విద్యుత్ శాఖ ఏడీఈ ఎం. శ్రీనివాసరావు, ఏఈ మస్తాన్‌వలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం పులిపాడు, దైద గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

ఇండియన్ విశ్వకర్మ జాతీయ ఉపాధ్యక్షుడిగా 'కొల్లోజు'



పిడుగురాళ్ల: ఇండియన్ విశ్వకర్మ గ్రూప్ ఆఫ్ ఆఫీసర్స్, బిజినెస్ మెన్స్ జాతీయ ఉపాధ్యక్షుడిగా తనను నియమించినట్లు పట్టణానికి కొల్లోజు ప్రసాద్ శనివారం తెలిపారు. హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో నియామక పత్రాన్ని జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బీఎస్‌వీ రాజశేఖర్, గౌరవాధ్యక్షుడు ప్రభాకర్ చేతుల మీదుగా అందుకున్నట్లు పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణులు 9.5 కోట్లు మంది ఉన్నారని, రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించాలని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన వారికి.. ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొల్లోజు వేణు చారి, పాండురంగా చారి, నివాస్, నాగ బ్రహ్మ చారి, గోపి, ఆనంద్, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసు కవాతు



పిడుగురాళ్ల రూరల్: పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆదేశాలతో చెన్నాయిపాలెం, కామేపల్లి, బ్రహ్మణపల్లి గ్రామాల్లో పిడుగురాళ్ల పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసు కవాతు కార్యక్రమం శనివారం నిర్వహించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి ఈ పోలీస్ కవాతు నిర్వహించారు. పట్టణ ఎస్ఐలు పఠాన్ రబ్బాని ఖాన్, అమీర్, సీఆర్పీఎఫ్ బలగాలు, ఏఎస్ఏస్ పార్టీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌కు అభివృద్ధి, సంక్షేమ విరుగుడు

ఒకప్పుడు ఫ్యాక్షన్‌తో అట్టుడికిన గ్రామం నేడు అభివృద్ధి, సంక్షేమ ఫలాలతో కళకళలాడుతోంది. ఇంటిముంగిటే సంక్షేమ లబ్ధి, వీధిలో అడుగుపెడితే సిమెంట్ రోడ్లు, సచివాలయంతో గ్రామంలోనే సమస్యల పరిష్కారం.. ఇలా మాదినపాడు గ్రామ రూపురేఖలు మారాయి. అత్యాధునిక హంగులతో ప్రభుత్వ పాఠశాలలు ఆధునీకరించడంతో పేదల పిల్లలు నాణ్యమైన విద్యనందుకునేందుకు అవకాశం ఏర్పడింది. రూ.30.63కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధి గ్రామస్తుల స్థితిగతులు మార్చాయి. ఇది ఒక వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే జరిగిన మార్పు. సీఎం వైఎస్ జగన్ దార్శనికతకు ప్రతిబింబం.



గ్రామంలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

- ఫ్యాక్షన్ తో అట్టుడికిన గ్రామంలో నేడు సంక్షేమ వెలుగులు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.30.63కోట్ల సంక్షేమం, అభివృద్ధి
- నాడు–నేడు చదువుకు దగ్గరైన పేద పిల్లలు
- ఆదర్శంగా నిలుస్తున్నమాదినపాడు గ్రామం

గ్రామం :	మాదినపాడు
గ్రామ జనాభా:	3,017
ఓటర్లు :	2,470 మంది
డీబీటీ లబ్ధి :	రూ 24,57,11,201లు
నాన్ డీబీటీ లబ్ధి:	రూ.6,06,37,624లు
మొత్తం నిధులు:	రూ.30.63 కోట్లు

దాచేపల్లి : మండలంలోని మాదినపాడు గ్రామంలో గత ఐదేళ్లలో.. రూ.5.85 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. వీటిలో రూ.35 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.25 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం, రూ.1.54 కోట్లతో మనబడి నాడు–నేడు ద్వారా జెడ్పీ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులు, ప్రాథమిక పాఠశాల ఆధునీకరణ, రూ.54లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం, రూ.21లక్షలతో గ్రావెల్ రోడ్లు, రూ.2.30 లక్షలతో మంచినీటి బోర్లు ఉన్నారు. అలాగే 168 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు.



మాదినపాడు గ్రామ సచివాలయం భవనం

ఆర్థికంగా బలోపేతం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మా గ్రామం అన్ని విధాల అభివృద్ధి చెందింది. సంక్షేమ పథకాలు ప్రజలను ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు దోహదపడ్డాయి. అభివృద్ధి ఫలాలు గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపించాయి.

– ఎ.అంజిరెడ్డి, సర్పంచ్, మాదినపాడు

పేద పిల్లలకు నాణ్యమైన విద్య



సుమారుగా రూ.కోటిన్నర నిధులతో హైస్కూల్, ప్రాథమిక పాఠశాలను అభివృద్ధి చేశారు. పిల్లలు చదువుకునేందుకు అన్ని వసతులు కల్పించారు. కార్పొరేట్ స్థాయిలో నిరుపేదలైన మా పిల్లలకు చదువు చెబుతున్నారు. పిల్లల చదువులకు ఈ ప్రభుత్వం భరోసా కల్పించింది.

– చింతల దానియేలు, ఎస్సీ కాలనీ, మాదినపాడు



నాడు–నేడు ద్వారా అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాల



జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు

వైఎస్సార్ సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

విజయపురిసౌత్: చింతలతండా గ్రామంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన 20 కుటుంబాలు ఆ పార్టీని వీడి ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో శనివారం చేరాయి. వారికి పీఆర్కే పార్టీ కండువాలు సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రమావత్ రాములునాయక్, రమావత్ సక్రూనాయక్, నందానాయక్, మూడావత్ స్వామినాయక్, రమావత్ ధాకు, రమావత్ బాబి, తావు జఠావత్ లచ్చి, మూధావత్ జ్యోతి, రమావత్ బుజ్జి, రమావత్ లక్ష్మా, జఠావత్ లక్ష్మి, రమావత్ గబ్బర్‌సింగ్ నాయక్, రమావత్ హనుమంత్‌నాయక్, బుజ్జినాయక్ తదితర 20 కుటుంబాలు ఉన్నారు. చింతలతండా సర్పంచ్ కేతావత్ శ్రీనునాయక్, రమావత్ గబ్బర్‌సింగ్ నాయక్, రమావత్ హనుమంత్‌నాయక్, బుజ్జినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ నాణ్యమైన వైద్యం

మాచర్ల: పేదలందరికీ ఉచిత వైద్యమందించాలన్న లక్ష్యంతో ఆరోగ్య శ్రీ పరిమితిని పెంచి, నాడు–నేడు ద్వారా భవనాలు నిర్మించి, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 24వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మాజీ చైర్మన్‌లు బత్తుల ఏడుకొండలు, బోయ రఘురామిరెడ్డి, తురక కిషోర్, పార్టీ పట్టణాధ్యక్షుడు పోలా శ్రీనివాసరావు, డాక్టర్ లక్ష్మి ప్రసన్న, కో–ఆప్షన్ మెంబరు సుధాకరరెడ్డి, చెన్నయ్య, అంకిరెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం



ర్యాలీలో సూపర్‌వైజర్ ప్రసన్న కుమారి,కార్యకర్తలు

పిడుగురాళ్ల: సరైన పోషకాహారంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ టి.ప్రసన్నకుమారి తెలిపారు. పట్టణంలోని 29వ వార్డులోని మందుల గడ్డలో శనివారం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మందుల గడ్డ నుంచి ఐలాంగ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమారి మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 6 నెలల ఉన్న పిల్లలకు పౌష్టికాహారం తప్పని సరిగా అందించాలన్నారు. అనంతరం వారికి అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. ఈ కార్యక్రంలో వార్డు కౌన్సిలర్ షేక్ సైదావలి, మందుల గడ్డ ప్రాంతంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోతులదాడి.. ఇద్దరికి గాయాలు

పిడుగురాళ్ల: వానరాల దాడిలో ఇద్దరు గాయపడిన ఘటన పట్టణంలోని 4వ వార్డులో శనివారం జరిగింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నూర్‌బాషా రఫీ వీధిలో వెళ్తుండగా కోతులు దాడి చేయడంతో కాలికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఎస్సీ బాలికల హాస్టల్లో వంట మనిషిగా చేస్తున్న రాములమ్మపై కూడా కొతులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. పట్టణంలో కోతులు బెడద అధికమైందని, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా..పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేపు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

విజయపురిసౌత్: గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు అన్న సంతర్పణ, కోలాటంలో పుర వీధుల్లో స్వామివారి ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

ఏసు ప్రభువుకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించాలి

విజయపురిసౌత్: ఏసు ప్రభువుకు ఎల్లప్పుడూ కృతజ్ఞత స్తుతులు చెల్లించుట రక్షణదాయకమని గుంటూరు పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. సాగర్ మాత మహోత్సవం ముగింపు రోజు శనివారం జరిగిన సమష్టి దివ్యబలిపూజా కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ఉపదేశించారు. ముందుగా ఆయనకు భక్తులు ఘన స్వాగతం పలికారు. సాగర్‌మాత రథోత్సవం సాయంత్రం విజయపురిసౌత్‌లో ఘనంగా నిర్వహించారు. పురవీధుల్లో గురు పుంగవులు, క్రైస్తవ కన్యలు, ఆలయ పెద్దలు మరియ మాత గీతాలు ఆలపిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా సాగర్‌మాత దేవాలయం, అంబేడ్కర్ సెంటర్, పార్కు సెంటర్ వద్ద పాము, చెట్టు రూపాలలో తయారు చేసి కాల్చిన బాణ సంచా పలువురిని ఆకర్షించాయి. ఫాదర్స్ చిన్నాబత్తిని హృదయ్‌కుమార్, మనోజ్‌కుమార్, ఆలయ పెద్దలు ఎం.జోషి, జెక్కిరెడ్డి చిన్నపరెడి, డి.ఇన్నారెడ్డి, కె.శౌర్రాజు, మరియదాసు, శౌరిబాబు, బాలస్వామి పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న చిన్నాబత్తిని భాగ్యయ్య

రక్తహీనత లేని సమాజం కోసం కృషి

రెంటచింతల: రక్త హీనత లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి సమష్టిగా కృషి చేద్దామని అంగన్వాడీ సూపర్‌వైజర్ ఎ. నాగమణి అన్నారు. శనివారం పోషణ పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని పాలువాయి గేటు గ్రామ వీధుల్లో అంగన్వాడీ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు, కిశోర్ బాలికలకు రక్తహీనత పై అవగాహన కల్పించారు. చిన్నారులకు అందించే వ్యాధి నిరోధక టీకాలు, వాటి ప్రాముఖ్యతను ఆరోగ్య కార్యకర్తలు తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గురజాల: ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మాచర్లకు చెందిన బి.దుర్గాప్రసాద్ దాచేపల్లి నుంచి మాచర్లకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. గురజాలలోని వీఎంఏఎస్ క్లబ్ సమీపంలో రోడ్డు దాటుతున్న వై.నాగేశ్వరరావు (46)ను ఢీకొట్టాడు. ప్రమాదంలో నాగేశ్వరరావు తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రుడిని గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం గుంటూరుకు రిఫర్ చేశారు. గుంటూరు తీసుకెళుతున్న సమయంలో మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల వైద్యశాలకు తరలించారు.